


# అమెరికా పలకరింపులు

## అమెరికామెడీ కబుర్లు -10

మా నలుగురం ..అంటే ఒక సన్మాన స్మామ్రాట్, ఒక గాయక శిరోమణి, ఒక గాయక రత్న, మరియు ఒక చోదక స్మామ్రాట్ అనగా నేను.... కలిసి గత రెండు నెలలగా అమెరికా అంతటా ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తూ, ఇప్పటికి మేము వెళ్ళిన 27 అమెరికా నగరాలలోనూ నేను గమనించిన విషయం ఏమిటంటే తెలుగు వారి పలకరింపులు పరిపరి విధములుగా ఉండునూ అని మాత్రమే.

ఉదాహరణకి ఒకానొక పెద్ద నగరంలో, నా అభిమాన రచయిత గారు పరిగెట్టుకొచ్చి "నీకు ఇది తెలుసా" అన్నారు.

"భలే వారే, మహాశయా, నాకున్న వెర్రి, మరియు వెచ్చి...సారీ...పిచ్చి మరియు వెర్రివేషాలు మీకు తెలిసినవే కదా, కొత్తగా ఏమి తెలియాలి సార్" అన్నాను.

" అది కాదు, ఏమిటో, నేను గత రెండు, మూడు నెలలుగా ఈ మధ్య మంచం మీద నుంచి క్రింద పడటం లేదు, అయాం వర్రీడ్, నువ్వు నీ చచ్చు రాతల్ని చాలా ఇంప్రూవ్ చెయ్యాలి" అని సలహా ఇచ్చారు.

"అదేమిటి సార్, మంచం మీద నుంచి స్పెషల్ ఎఫెక్ట్సుతో నేలమీద పడడం ఎందుకూ, హాయిగా నేలమీదే పడుకోవచ్చుగా" అన్నాను విషయం అర్థం అవక.

"అభ్భ, వెధవ చమత్కారమూ, నువ్వూనూ, నేను అనేది అది కాదు" అని అసలు విషయం విశదీకరించారు నా అభిమాన రచయిత గారు.

ఆయన క్లుప్తంగా విశదీకరించిన విషయం ఏమిటంటే ఇది వరలో నేను వ్రాసిన అమెరికాకాలక్షేపాలూ, అమెరికామెడీలో మొదలైనవి చాలా మటుకు ఎప్పుడు చదివినా నవ్వలేక, మంచం మీదనుంచి క్రిందకి పడిపోయి, దొర్లుతూ ఆనందించేవాడిననియూ, ఇటీవల నేను వ్రాసిన వన్నీ నా "మొహం" లా ఉన్న కారణం చేత కేవలం చిరునవ్వే కాని, పగలబడి నవ్వుతూ మంచం నుంచి క్రిందకి పడిపోయి ఆనందించే సీను బొత్తిగా లేదనీ, అటువంటి ప్రాక్టీసు తప్పిపోతే తను చాలా ఇబ్బంది పడుతాననీ, నువ్వు నీ చచ్చు రాతల్ని చాలా ఇంప్రూవ్ చెయ్యాలి సుమా' అని ఆయన వాపోయారు.

ఆయన నిర్వచించిన "నా మొహం" అనేది ఆయన మొహమో, లేదా కించిత్తు వార్ధక్య ఛాయలు గోచరిస్తున్నప్పటికీ అందచందాలు వెల్లివెరిసే నా ఒరిజినల్ మొహమో తెలియక నేను కించిత్తు గించుకున్న విషయం వాస్తవమే.

నాకు వెంఠనే విషయం ..అనగా ఆయన బాధ అర్థమయిపోయి, నా సెల్ ఫోన్‌లో ఆయన సతీమణి, తదితరులనీ పిలిచి ఆ మహాశయుడు గారు, నా కథ కానీ, వ్యాసం కానీ మరేదైనా కానీ చదవడం మొదలెట్టగానే, రహస్యంగా, కనపడకుండా, నాజూగ్గా చాలా సహజంగా ఆయనని మంచం మీదనుంచి క్రిందకి తోసేసి, ఆయన్ని ఆనందపరిచే ఒప్పందం చేసేసుకున్నాను. ఎందుకంటే నేను వ్రాసే చెత్త ఆయనకి, మరియు ఇంకెవరికైనా అరక్షణం నవ్వించగలిగితే నాకు అంతకంటే మహదానందం ఇంకేమీ లేదు. అమెరికాలో కొంత మంది అస్మదీయ మరియు తస్మదీయ ప్రముఖ సాహితీ వేత్తల దృష్టిలో "లో క్వాలిటీ" రచయితల లిస్ట్ లో నా పేరే హై లెవెల్లో ఉంటుంది కానీ నా గోల నాదీ, వారి గోల వారిదీ! అందువలన నా ఏర్పాట్లు నేనే చేసుకోవాలి కదా! నాకు అమెరికాలో గాఢ మిత్రులూ, నిగూఢ శత్రువులూ ఉన్నారు మరి.

మరొక ఘంటసాల ఆరాధనోత్సవాల కార్యక్రమంలో ఒకాయన నన్ను చూడగానే "అయ్యో అలా అయిపోయారేం" అని అఖండంగా ఆశ్చర్యపోయాడు. పాపం ఏమయిందో అని వెనక్కి తిరిగి చూశాను. నా వెనకాలే ఐశ్వర్యా రాయ్ మహా గొప్పగా ముస్తాబు చేసుకుని, సర్వాంగ సుందరంగా ఏ ఏంగిల్ చూసినా భలే సెక్సీగా ఉన్న అమ్మాయిని చూడగానే ఈ ఆప్త మిత్రుడు చెప్పిన "అదేం అలా అయిపోయారేం"అనే ప్రగాఢమైన డైలాగు సదరు ఐశ్వర్యా రాయ్‌ని ఉద్దేశించి కాదనియూ, ఆ చచ్చు అభిప్రాయం నా గురించి మాత్రమే అనియూ నాకు స్పష్టంగా తెలిసిపోయింది.

ఈ పలకరింపుల టాపిక్ మీద చాలానే వ్రాయగలను కానీ రేప్పొద్దున్నే కన్నెక్టికట్, బోస్టన్ మరియు న్యూయార్క్ వెళ్ళాలి కాబట్టి, అర్జంటుగా ఇంటికి వెళ్ళి మా క్వీన్ విక్టోరియాకి చాలా కాలం తరవాత నా మొహం చూపించాలి కాబట్టి.....అర్జంటుగా శలవు తీసుకుంటున్నాను....